## డీడీఎంఎస్ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 3: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు శనివారం తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నిషియన్, డయాలసిస్ అసిస్టెంట్, బెడ్‌సైడ్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, బెడ్‌సైడ్ అసిస్టెంట్ కోర్సు కనీస అర్హత ఎనిమిదో తరగతి, కాగా, మిగిలిన కోర్సులకు కనీస అర్హత పదో తరగతి అని తెలిపారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 83090 37134, 63058 95867లలో సంప్రదించాలని సూచించారు.

## లా పీజీ డిప్లమా పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని లా విభాగంలో పీజీ డిప్లమా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ పరీక్షల విభాగం కంట్రోలర్ ప్రొ. రాములు తెలిపారు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, సైబర్ లాస్, టాక్సేషన్ అండ్ ఇన్సూరెన్స్ లాస్, ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ లాస్, అప్లైడ్ హ్యూమన్ రైట్స్, మోడర్న్ కార్పొరేట్ లాస్ తదితర పీజీ డిప్లమా కోర్సుల మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 15వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.100 అపరాధ రుసుముతో 22వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

## ఎంసీఏ రివాల్యుయేషన్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

ఉస్మానియా పరిధిలోని ఎంసీఏ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్ దరఖాస్తుకు స్వీకరణ గడువును పొడిగించారు. రెండేళ్ల ఎంసీఏ అన్ని సెమిస్టర్ల మెయిన్, బ్యాక్‌లాగ్, మూడేళ్ల ఎంసీఏ మొదటి, రెండు, మూడు, నాలుగో సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు రూ.200 అపరాధ రుసుముతో నియమిత ఫీజును ఈ నెల 5వ తేదీ వరకు చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## రేడియోలాజికల్ ఫిజిక్స్ రివాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని పరీక్షల విభాగం అధికారులు చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 7వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

## బీ ఫార్మసీ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా పరిధిలోని బీఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ప్రొ. రాములు తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) అన్ని సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## జేఎన్టీయూలో 10న ఇంక్యుబేటర్ కెపాసిటీ బిల్డింగ్ ప్రొగ్రామ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): జేఎన్టీయూ, ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సెల్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఇంక్యుబేటర్ కెపాసిటీ బిల్డింగ్ ప్రొగ్రామ్‌ను నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ వర్సిటీలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.శ్రీదేవి పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం జేఎన్టీయూ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

# మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థినుల ఆందోళన

### కోఠి మహిళా కళాశాలలో పెంచిన ఫీజులను తగ్గించాలని ధర్నా

కోఠి మహిళా కళాశాల ప్రధాన ద్వారం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 3: కళాశాలలో సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పీజీ విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు శనివారం కోఠి చౌరస్తాలోని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం ప్రధాన ద్వారం ఎదుట పీజీ విద్యార్థినులు బైఠాయించి తమ సమస్యలను పరిష్కరించాలని, పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని నిరసన వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యం అటానమస్ సెమిస్టర్‌కు గతంలో రూ.3,500ల ఫీజు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం ఆ ఫీజును రూ.5 వేలుగా నిర్ణయించడం పట్ల పేద విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ఫీజులను తగ్గించాలని, హాస్టల్‌లో సరైన వసతులు కల్పించాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను పలుమార్లు అడిగినా పట్టించుకున్న దాఖలాలు లేవని మండిపడ్డారు. ప్రధానంగా హాస్టల్‌లో మంచినీటి వసతి, మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలన్నారు.

# పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ముగింపు మీట్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం జరిగిన సైబరాబాద్ 6వ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 ముగింపు కార్యక్రమానికి డీజీపీ రవి గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మహిళలు, పురుషులకు వేర్వేరుగా నిర్వహించిన 100 మీటర్ల పరుగు పందేన్ని తుపాకీ గాలిలోకి కాల్పులు జరిపి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో పురుషుల విభాగంలో రమేష్ పీసీ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్, మహిళల విభాగంలో రమాదేవి పీసీ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ టీములు గెలుపొందాయి. అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ ప్రాక్టీస్ నెట్, ఓపెన్ జిమ్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి పాల్గొన్నారు.

## హౌసింగ్ ఉద్యోగుల సమస్యలు తీరుస్తాం

● మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరిస్తామని రెవె న్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. బంజారాహిల్స్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్లు, వర్క్ ఇన్ స్పెక్టర్ల డైరీ, క్యాలెండర్‌ను మంత్రి శనివారం ఆవిష్కరించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ హౌసింగ్ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం బాధ్యత తనదేనని, ఉద్యోగులను సొంత కుటుంబ సభ్యుల మాదిరిగా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ గృహవసతి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో హౌసింగ్ శాఖ చీఫ్ ఇంజనీర్ ఈశ్వరయ్య, సంఘం అధ్యక్షుడు గవ్వ రవీందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బొగ్గుల వెంకట రామిరెడ్డి, కార్యదర్శి రఘువీర్ ప్రసాద్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన వ్యాధులపై నిమ్స్‌లో అవగాహన

ఖైరతాబాద్, ఫిబ్రవరి 3: జన్యుపరంగా వచ్చే అరుదైన వ్యాధులపై శనివారం నిమ్స్ దవాఖానలోని ఆడిటోరియం అవగాహన సదస్సు జరిగింది. నిమ్స్ మెడికల్ జెనెటిక్స్ విభాగం, సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ (సీడీఎఫ్‌డీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సును మెడికల్ జెనెటిక్స్ విభాగం వైద్యురాలు డాక్టర్ ప్రజ్ఞా రంగనాథ్, సీడీఎఫ్‌డీ వైద్యులు డాక్టర్ అశ్విన్ దలాల్, నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. జన్యూపరంగా వచ్చే అరుదైన వ్యాధులను ఎలా గుర్తించాలి? ఎలాంటి పరీక్షలు చేయాలి? అన్న పలు విషయాలపై, ప్రస్తుతం ఉన్న చికిత్స విధానాలు, పరిశోధనలపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## ఐఐసీటీ సైంటిస్టుకు వాస్విక్ అవార్డు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన సీనియర్ సైంటిస్ట్ గంగాగ్ని రావు వాస్విక్ అవార్డును అందుకున్నారు. పర్యావరణ రంగంలో ఆయన చేసిన పరిశోధనలకు గాను ఈ అవార్డును సొంతం చేసుకోగా, ప్రొ. ఎంఎం శర్మ, ప్రొ. మషేల్కర్ చేతుల మీదుగా పురస్కారం తీసుకున్నారు. ముంబైలో జరిగిన ఈ అవార్డుల వేదికలో పాల్గొని అరుదైన పురస్కారాన్ని పొందారు. కాగా, ఆయన ప్రతిష్టాత్మకమైన అవార్డును గంగాగ్ని రావు దక్కించుకోవడంపై ఐఐసీటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రస్తుతం ఐఐసీటీలో చీఫ్ సైంటిస్ట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఐయామ్ అన్‌స్టాపబుల్ అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యశోద వైద్య బృందం

# క్యాన్సర్ డెత్ సెంటెన్స్ కాదు

● యశోద డైరెక్టర్ డాక్టర్ పవన్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 3: క్యాన్సర్ వచ్చిందంటే మరణం సంభవిస్తుందన్న అపోహ వీడాలని, ఆ వ్యాధి ఎన్నడూ డెత్ సెంటెన్స్‌గా భావించకూడదని యశోద హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి అన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా శనివారం సాయంత్రం సోమాజిగూడలోని యశోద దవాఖానలో 'వీ ఇన్‌స్పైర్' పేరుతో ఏర్పాటు చేసిన క్యాన్సర్ సర్వైవర్స్ సపోర్ట్ గ్రూప్, 'ఐ యామ్ అన్‌స్టాపబుల్' అనే పుస్తకాన్ని ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పవన్, కన్సల్టెంట్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ సచిన్ మర్డా, యశోద హాస్పిటల్స్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ విభాగం జనరల్ మేనేజర్ విమలా ప్రసాద్, డాక్టర్ లింగయ్య, డాక్టర్ సోములు, రచనా ముడుంబైతో కలిసి ఆవిష్కరించారు. డాక్టర్ పవన్ మాట్లాడుతూ 20 ఏండ్ల క్రితం క్యాన్సర్ వ్యాధి అంటే మరణానికి దగ్గరకావడమేనని భావించే వారని, నాటి చికిత్స విధానంలో సర్వైవల్ రేట్ కూడా తక్కువేనన్నారు. నేడు వైద్య శాస్త్రంలో ఆధునికత సంతరించుకున్నదని, కొత్త ఆవిష్కరణలు, చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మరెన్నో పరిశోధనలు జరుగుతున్నాయని, ఫలితంగా సర్వైవల్ రేట్ పెరిగిందన్నారు. కీమో, రేడియో థెరపీలతో పాటు అధునాతన పద్ధతులు ఉన్నాయని, రోబోటిక్ సర్జరీ, ఇమ్యూనోథెరపి లాంటి చికిత్స విధానాలతో క్యాన్సర్ కణాలను పూర్తిగా నశింపచేయవచ్చన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ యశోదలో చికిత్స పొంది వ్యాధిని జయించిన వరంగల్ వాసి శ్రీకాంత్, కెన్యా దేశానికి చెందిన 78 ఏండ్ల జోసెఫ్ తమ అనుభవాలను పంచుకున్నారు.

వ్యాస రచన పోటీల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

# ఓయూలో వ్యాస రచన పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 3: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్వీ నాయకుడు కోదాటి నాగేందర్ రావు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేందర్ రావు మాట్లాడుతూ 'అప్పుడు ఎట్లుండే తెలంగాణ..? ఇప్పుడు ఎట్లుంది తెలంగాణ..?' అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఓయూ, నిజాం కళాశాల, సికింద్రాబాద్ పీజీ కళాశాల, సైఫాబాద్ పీజీ కళాశాలల విద్యార్థులతో పాటు అనుబంధ కళాశాలల విద్యార్థులు సైతం పాల్గొనవచ్చని చెప్పారు. పోటీలను ఈ నెల 14వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్, నాయకులు జంగయ్య, బాలెంల అవినాశ్, రామకృష్ణ, మిథున్, మధు, శ్రీను నాయక్, పవన్, సాయి, నిఖిల్, వంశీ, అజయ్, శ్రీరామ్ పాల్గొన్నారు.

## ఏఎస్ రావు నగర్‌లో జోయాలుక్కాస్ పునః ప్రారంభం

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన నగల వ్యాపార సంస్థ జోయాలుక్కాస్, అదనపు హంగులతో ఆధునీకరించిన తన అవుట్‌లెట్‌ను నగరంలోని ఏఎస్ రావు నగర్‌లో శనివారం ప్రారంభించింది. ఈ షోరూమ్‌ను సెలబ్రిటీ అతిథి శిల్పారెడ్డి, క్రాంతి గ్రూప్ డైరెక్టర్ రవి కుమార్ పాలిశెట్టి, కో జోయాలుక్కాస్ హెన్రీ జార్జ్, జోయాలుక్కాస్ మార్కెటింగ్ డీజీఎం అనీశ్ వర్గీశ్, జోయాలుక్కాస్ రిటైల్ మేనేజర్ రాజేశ్ కృష్ణన్, జోయాలుక్కాస్ రీజినల్ మేనేజర్ రాబిన్ తాంబి, జోయాలుక్కాస్ ఏఎస్ రావు నగర్ బ్రాంచి ఇన్‌చార్జ్ జిన్స్ సెబాస్టియన్‌ల ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు.

## ఆర్టీఏ కార్యాలయంలో హెల్త్ క్యాంపు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా శనివారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో హెల్త్ క్యాంప్ జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేష్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ రాంచందర్, ఎంవీఐ శ్రీనుబాబు, మల్లికార్జున్, ఏఎంవీఐ రుబీనా తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

## పతంజలి ఆయుర్వేద వైద్యం విశ్వవ్యాప్తం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 3: పతంజలి శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితంగా ఆయుర్వేద వైద్యం విశ్వవ్యాప్తంగా విస్తరించిందని పతంజలి యోగాపీఠ్ ఆచార్యులు బాలకృష్ణ జీ పేర్కొన్నారు. ఆయుర్వేదంలో చర్మంపై తెల్లటి మచ్చల నివారణకు మొదటిసారి పరిశోధనలు చేసిన ఘనత పతంజలి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్తలకే దక్కుతుందన్నారు. పతంజలి మెలనోగ్రిట్ ఔషధంపై ప్రపంచంలోని ప్రతిష్టాత్మకమైన పశోధన జర్నల్ బయోసైన్స్ రిపోర్ట్స్ కవర్ పేజీపై ప్రచురించబడిందని శనివారం జరిగిన కార్యక్రమంలో వెల్లడించారు. ఈ అధ్యయనం మెలనోగ్రిట్ యొక్క చికిత్సా సామర్థ్యాన్ని అంచనా వేయడంతో పాటు బొల్లి వ్యాప్తిని తటస్థీకరించిందని తెలిపారు. పతంజలి ఇప్పటికే కొన్నేండ్లుగా తెల్ల కుష్టు నివారణకు విశేషంగా కృషి చేస్తున్నదని తెలిపారు. పతంజలి ద్వారా పూర్తిగా న యం కాని వ్యాధులు సైతం పూర్తిగా నయమవుతున్నాయని, ఇది పతంజలి శాస్త్రవేత్తల నైతిక విజయమన్నారు.

## ఆనంద్‌కు స్వర్ణం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గచ్చిబౌలి వేదికగా జరిగిన ట్విన్ సిటీస్ అర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో భద్ర ఆనంద్ పసిడి పతకంతో మెరిసాడు. శనివారం జరిగిన బాలుర ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ గ్రూపు-సీ ఈవెంట్‌లో ఆరేండ్ల ఆనంద్ అగ్రస్థానంలో నిలువగా, మాన్యత, అనన్య రెడ్డి వరుసగా రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నారు. మరోవైపు గ్రూపు-ఏ, గ్రూపు-బీలో విద్యార్థి వర్మ, శాన్వి యాదవ్ పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

# బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

### ప్రత్యేక అధికారులకు కలెక్టర్ ఆదేశం

మేడ్చల్, ఫిబ్రవరి 3: బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని గ్రామ పంచాయతీలకు ఎంపికైన ప్రత్యేక అధికారులకు కలెక్టర్ గౌతమ్ సూచించారు. రాష్ట్ర మంత్రి సీతక్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం, కలెక్టర్ పంచాయతీల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు తమ విధులను ఎంతో జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా నడుచుకోవాలన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగస్వామ్యానికి యువత ప్రోత్సహించాలన్నారు. వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఉపాధి హామీ కూలీల శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## జేఎన్టీయూలో మాజీ రిజిస్ట్రార్ ప్రొ. మంజూర్‌కు సన్మానం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): జేఎన్టీయూ హైదరాబాద్‌కు రిజిస్ట్రార్‌గా సేవలందించి జనవరి 31న పదవీ విరమణ చెందిన ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్‌ను యూనివర్సిటీలోని గోల్డెన్ జూబ్లీహాల్‌లో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్‌కు శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని బహుమతిగా అందజేశారు. అలాగే, యూనివర్సిటీకి రెక్టార్‌గా ఆరేండ్లు సేవలందించిన ప్రొఫెసర్ గోవర్ధన్‌కు కూడా యూనివర్సిటీ వీసీ ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ వీసీ డాక్టర్ వెంకటేశ్వరరావు, పీఆర్‌వో డాక్టర్ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్టీయూలో పలువురు వీసీల సందర్శన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): జేఎన్టీయూను ఓయూ, శాతవాహన, మహాత్మా గాంధీ, కాకతీయ, పాలమూరుకు చెందిన పలువురు వైస్ ఛాన్సలర్లు సందర్శించారు. ఈ మేరకు జేఎన్టీయూలో సాంకేతిక పరంగా జరిగిన అభివృద్ధి గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని అన్ని బ్లాకులను సందర్శించారు. జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన జేహబ్, ఆధునిక సౌకర్యాలు, ల్యాబులు, హాస్టళ్లు, ఇక్లాస్ రూమ్‌లు, నీటి వసతి, యూనివర్సిటీ లైబ్రరీ, కాలేజీ లైబ్రరీ, స్పోర్ట్స్ కాంప్లెక్స్, గ్రీనరీతో పాటు ఆయా విభాగాలను సందర్శించారు.

## ఎన్నికల బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కోసం పని చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులను వెంటనే చెల్లించాలని జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌కు లేఖ రూపేణ శనివారం విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర ఎన్నికల ఏర్పాట్ల కోసం గ్రేటర్ పరిధిలోని 15 అసెంబ్లీ స్థానాల ఏర్పాట్లకు సంబంధించిన బిల్లులు ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. డీఆర్‌సీ సెంటర్లు, ఏఎంఎఫ్, డీఎంఎఫ్‌లకు చెందిన ఏర్పాట్లను కాంట్రాక్టర్లు చేసినా, వాటికి సంబంధించిన బిల్లులు రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సంబంధిత రిట్నరింగ్ అధికారులు తమకు చెల్లించలేదని లేఖలో పేర్కొన్నారు. కాంట్రాక్టర్ల విజ్ఞప్తిని పరిశీలించి తమకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి విజ్ఞప్తి చేశారు.

## రాజిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

● వాటర్ వర్క్స్ ఉద్యోగుల సంఘం

సిటీబ్యూరో, జనవరి 3(నమస్తే తెలంగాణ): తమ యూనియన్‌కు సంబంధం లేని కె.రాజిరెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలంగాణ వాటర్ వర్క్స్ యూనియన్ అధ్యక్షులు జి.రాంబాబు యాదవ్ శనివారం పేర్కొన్నారు. 'బీఆర్ఎస్ యూనియన్ నేతలపై వేటు' అంటూ చేసిన వ్యాఖ్యలు సరికాదని, కె.రాజిరెడ్డి, ఎం.డీ.జహంగీర్‌లను గతంలోనే యూనియన్ నుంచి తొలగించామని తెలిపారు. వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ (రిజిస్టర్ నం.బి2873) బీఆర్టీయూ(భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్)కు అనుబంధం. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాజిరెడ్డి, జహంగీర్ వచ్చి పార్టీలో చేరారని తెలిపారు. తరువాత కాలంలో అవినీతి కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటే చాలా సార్లు మందలించామని, అయినా బుద్ధి మార్చుకోలేదన్నారు. అందుకే వారిని యూనియన్ నుంచి తొలగించామని వివరించారు.